
క్లుప్తంగా

నేలకూలిన భారీ వృక్షం



రొళ్ల కొండ సమీపంలో పడిపోయిన రావిచెట్టు

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లకొండ గ్రామ సమీపంలోని ఈశ్వర ఆలయం ఎదురుగా 544ఈ జాతీయ రహదారి పక్కన రొళ్లకొండ ప్రాంతం ఆనుకుని దాదాపు 150 ఏళ్ల భారీ రావి చెట్టు వృక్షం నేలకూలింది. మండల వ్యాప్తంగా ఇంత పెద్ద రావి చెట్టు మరెక్కడా కూడా లేదని స్థానికులు తెలిపారు.

గోశాల ప్రారంభం



గోమాతలకు పూజలు నిర్వహిస్తున్న స్వామిజీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గోశాలను సోమవారం పట్టనాయన హళ్లి నంజవధూతస్వామిజీ ప్రారంభించారు. అనంతరం గోమాతలకు పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద గోమాతకు పూజలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



రంగమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హిందూపురం టౌన్: విద్యార్థులను ప్రోత్సహిస్తూ భావవ్యక్తీకరణకు కృషి చేస్తున్న మండలంలోని జి.గుడ్డంపల్లి గ్రామ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు జి.రంగమ్మను ఎంఈఓలు ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ మాట్లాడుతూ 'పిల్లలు చెప్పిన కథలు – పిల్లల భావవ్యక్తీకరణ పోటీల్లో విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహించి, వారికి భావవ్యక్తీకరణకు ఉపాధ్యాయులు రంగమ్మ కృషి చేశారన్నారు.

రీసర్వే రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

హిందూపురం: మండలంలోని తూమకుంట, నక్కలపల్లి గ్రామాలకు సంబంధించిన రీసర్వే రికార్డులను ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పరిశీలించారు. సోమవారం హిందూపురం తహశీల్దార్ ఆఫీసులో రీసర్వేకు సంబంధించిన రికార్డులు, నక్కలపల్లి, తూముకుంట గ్రామాల రహదారులకు సంబంధించిన రికార్డులు, అలాగే ముద్దునూరు–గోరంట్ల నుంచి హిందూపూర్ సెక్షన్ వరకూ జాతీయ రహదారి 716జీ ఏర్పాటుకు సంబంధించి పురోగతిని పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

పావగడ: తల్లితండ్రులు తమ పిపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ సూచించారు. తాలూకాలోని బీ హొసహళ్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

మడకశిరలో తాగునీటికి కటకట

మడకశిర: మడకశిర నగర పంచాయతీలో పలు కాలనీలకు గత మూడు రోజులుగా తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు కాలనీలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. మడకశిర చెరువు నుంచి కోటవీధిలోని ట్యాంకుకు నీటిని సరఫరా చేసే మెయిన్ పైపులైన్ తాజ్ క్లినిక్ సమీపంలో దెబ్బతిని చాలా రోజులు గడిచినా దాన్ని సకాలంలో మరమత్తు చేయలేదు. దీంతో గత మూడు రోజుల నుంచి చెరువు దగ్గర నీటి పంపింగ్ నిలిపి వేశారు. దీంతో పట్టణంలోని పలు కాలనీల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

హిందూపురం: మండలంలోని గోళ్లాపురం ఇండస్ట్రియల్ ఏరియాలో రోడియం ఫేరోస్ అల్లైస్ ఫ్యాక్టరీలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సేనాపతి పనిచేస్తూ ఫ్యాక్టరీ క్వాటర్స్‌లో నివాసం ఉన్నారు. అయితే అతని భార్య సంధ్యారాణి సాహు (29) సోమవారం ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయింది. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

15 గ్రామ పంచాయతీల్లో వాల్టా

- చట్టం అమల్లో ఉన్న చోట వ్యవసాయ బోరు బావుల తవ్వకంపై నిషేధం
- ఉల్లంఘిస్తే చర్యలు తప్పవంటున్న అధికారులు
- వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకూ కష్టాలు
- రైతులకు తప్పని ఇబ్బందులు



మడకశిర నియోజకవర్గంలోని పలు గ్రామాల పరిధిలో కూటమి ప్రభుత్వం వాల్టా చట్టాన్ని (ఏపీ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీ యాక్ట్–2002) అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో ఆయా గ్రామాల్లో నూతన వ్యవసాయ బోరు తవ్వకాలపై కూడా నిషేధం విధించింది. ఈ చట్టాన్ని 2002లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు తీసుకొచ్చారు. ప్రస్తుతం కూడా ఆయన ఆధ్వర్యంలోనే కూటమి ప్రభుత్వం మళ్లీ అమలు చేస్తోంది. ఈ చట్టంతో ఆయా గ్రామాల రైతులకు కష్టాలు తప్పని పరిస్థితి ఏర్పడింది.

మడకశిర: నియోజకవర్గంలో 15 గ్రామ పంచాయతీల పరిధిలో వాల్టా చట్టం అమల్లోకి వచ్చింది. మడకశిర మండలంలో ఈ చట్టం పరిధిలోకి ఏ గ్రామాలు రాలేదు. అయితే అగళి మండలంలో 6 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ చట్టం కింద వ్యవసాయ బోర్ల తవ్వకాలను ప్రభుత్వం నిషేధించింది. ఈ మండలంలోని హెచ్‌డీ హళ్లి, మధూడి, పీ బ్యాడిగెర, ఇనగలూరు, రావుడి, నరసంబూది పంచాయతీల్లో బోర్ల తవ్వకాలపై నిషేధం ఉంది. అదే విధంగా అమరాపురం మండలంలో తమడేపల్లి పంచాయతీలో కూడా ఈ చట్టం ప్రకారం బోర్లను తవ్వకూడదు. రొళ్ల మండలంలో 5 గ్రామ పంచాయతీల్లో నిషేధం విధించారు. బీజీ హళ్లి, దొడ్డేరి, ఎంరాయాపురం, కాకి, రొళ్ల, గుడిబండ మండలంలో కేకాతి, ఎస్ రాయాపురం, గుణేమోరు బాగల్ పంచాయతీల్లో వ్యవసాయ బోర్ల తవ్వకాలపై వాల్టా చట్టం కింద ప్రభుత్వం నిషేధం విధించారు.

నీటి వినియోగం ఎక్కువ ఉన్న చోట..

నియోజకవర్గంలో 66 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా నీటిని వినియోగిస్తున్న గ్రామ పంచాయతీల్లో వాల్టా చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. మడకశిర నియోజకవర్గంలోనిపై 15 గ్రామ పంచాయతీల్లో అత్యధికంగా నీటిని వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వాల్టా చట్టం కింద బోర్ల తవ్వకాలపై నిషేధం విధించారు. మిగిలిన 51 పంచాయతీల్లో రైతులు వ్యవసాయ బోర్లను వేయించుకోవడానికి ఎలాంటి నిషేధం ఉండదని అధికారులు చెబుతున్నారు.

రైతులకు తప్పని కష్టాలు

వాల్టా చట్టం అమల్లో ఉన్న గ్రామ పంచాయతీల్లోని రైతులకు కష్టాలు తప్పని పరిస్థితి. 15 గ్రామ పంచాయతీల్లో ఈ చట్టం అమల్లో ఉండడంతో ఆయా పంచాయతీల రైతులు నూతనంగా వ్యవసాయ బోర్లను వేసుకునే అవకాశం కోల్పోయారు. ప్రధానంగా ఎంతో మంది రైతులు వ్యవసాయ బోర్లపై ఆధార పడి వివిధ తోటలను సాగు చేశారు. ముఖ్యంగా వక్క తోటలను వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ బోర్ల తవ్వకాలపై నిషేధం విధించడంతో రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. వేసవి కాలం ప్రారంభమవడంతో ప్రస్తుతం ఉన్న వ్యవసాయ బోర్లలో నీటి మట్టం క్రమేణా తగ్గుతోంది. వేసవి కాలం చివరిలో చాలా బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితిలో కొత్త బోర్ల తవ్వకాలపై నిషేధం విధించడంతో సాగు చేసిన తోటలను ఎలా కాపాడుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బోర్లు తవ్వితే చట్టపరమైన చర్యలు

నిషేధిత గ్రామాల్లో చట్ట ప్రకారం బోర్లు వేయకూడదు. అయితే రైతులు ఈచట్టాన్ని అతిక్రమించి బోర్లు వేస్తే చట్టపరంగా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎవరైనా రైతులు బోర్లు వేయిస్తుంటే స్థానికంగా ఉండే వీఆర్‌ఓలు తహసీల్దార్లకు సమాచారం ఇస్తారు. వెంటనే తహసీల్దార్ ఆ గ్రామానికి చేరుకుని బోరు వేస్తున్న రిగ్‌ను సీజ్ చేస్తారు. కేసు కూడా నమోదు చేస్తారు. సదరు రైతులపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. ఈ చట్టం అమలులో ఉన్న గ్రామాల్లో అత్యవసరమైతేనే అనుమతి తీసుకుని తాగునీటి కోసం బోర్లను వేయాల్సి ఉంటుంది.

విద్యుత్ సర్వీసులపైనా నిషేధం

వాల్టా చట్టం అమలులో ఉన్న గ్రామాల్లో నూతన వ్యవసాయ విద్యుత్ సర్వీసులపై కూడా ప్రభుత్వం నిషేధం విధించింది. ఒకవేళ రైతులు గుట్టుచప్పుడు కాకుండా ఈ చట్టాన్ని ఉల్లంఘించి బోర్లు తవ్వుకున్నా విద్యుత్‌శాఖ అధికారులు నూతన ఈ బోర్లకు విద్యుత్ సర్వీసును మంజూరు చేయరు. ఇదిలా ఉండగా ఈచట్టం అవినీతి అధికారులకు వరంగా మారుతుందంటున్నారు. బోర్ల తవ్వకాలను చూసీ చూడనట్లు ఉండేందుకు అవినీతి అధికారులు రైతుల నుంచి డబ్బులు వసూలు చేయడానికి ఇది ఎంతగానో దోహదం చేస్తుందని చెబుతున్నారు. ఏది ఏమైనా వాల్టా చట్టం రైతులకు శాపంగా మారింది.

బోరు తవ్వకాలపై నిషేధం విధించిన గ్రామాలివే..

అగళి మండలం: హెచ్‌డీ హళ్లి, ఇనగలూరు, మధూడి, నరసంబూది, పీబ్యాడిగెర, రావుడి

అమరాపురం మండలం : తమడేపల్లి

గుడిబండ మండలం : గుణేమోరుబాగల్, కేకాతి, ఎస్.రాయాపురం

రొళ్ల మండలం: బీజీ హళ్లి, దొడ్డేరి, ఎంరాయాపురం, కాకి, రొళ్ల

కొత్తగా బోరు వేయించలేకపోతున్నాం



తమడేపల్లి పంచాయతీలో వాల్టా చట్టం కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. కొత్తగా బోర్లు వేయించుకోలేకపోతున్నాం. ఉన్న బోర్లు ఎండిపోతే వక్క తోటలను కాపాడుకోవడానికి కొత్త బోర్లు వేయించుకోవాల్సి ఉంటుంది. తమడేపల్లి పంచాయతీలో వాల్టా చట్టాన్ని ఎత్తి వేయాలని అధికారులకే విన్నవించుకున్నాం. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వాల్టా చట్టాన్ని ఎత్తి వేయాలి.

– నాగేగౌడ్, రైతు, తమడేపల్లి

వాల్టా చట్టం.. రైతులకు శాపం



వాల్టా చట్టం రైతులకు శాపంగా మారింది. ఇనగలూరు పంచాయతీని వాల్టా చట్టం పరిధిలోకి తీసుకురావడం అన్యాయం. కొత్తగా బోర్లు వేయించుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం రైతులు వేసుకునే బోర్లపై నిషేధం విధించడం మంచిదికాదు. వెంటనే ప్రభుత్వం రైతులు ఇబ్బందులు పడకుండా ఈచట్టాన్ని అమలు చేయాలి. లేకపోతే కూటమి ప్రభుత్వం రైతుల ఆగ్రహాన్ని చూడాల్సి ఉంటుంది.

– రాజప్ప, రైతు, ఇనగలూరు

విద్యుత్ సర్వీసులు ఇవ్వబోం

రాష్ట్ర ప్రభుత్వం కొన్ని గ్రామాలను వాల్టా చట్టం పరిధిలోకి తీసుకొచ్చింది. ఈ గ్రామాల్లో బోర్ల తవ్వకాలపై నిషేధం ఉంది. రైతులు తెలిసో తెలీకో కొత్తగా బోర్లు వేసుకున్నా విద్యుత్ సర్వీసులు ఇచ్చే పరిస్థితి ఉండదు. రైతులు ఈవిషయాన్ని గుర్తించాలి. వాల్టా చట్టం అమలులో ఉన్న గ్రామాల్లో రైతులు బోర్లు వేయించి విద్యుత్ సర్వీసుల కోసం ఇబ్బందులు పడొద్దు.

–రఘు, డీఈ, ట్రాన్స్‌కో, మడకశిర

వివిధ సమస్యలపై పది అర్జీలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై పది అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా విగ్రహ పునఃప్రతిష్టాపన



అలంకరణలో మారెమ్మదేవి

రొళ్ల: మండల పరిధిలోని చర్లోపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కణువే మారెమ్మదేవి విగ్రహ పునఃప్రతిస్టాపన కార్యాక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సర్పంచ్ నరసింహప్ప, వార్డు మెంబర్ వజీర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలివ్వాలని నిరసన

పెనుకొండ రూరల్: ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. పట్టణంలోని గోనిపేట రహదారిలో శ్రీకృష్ణదేవరాయల కాలనీలో కొందరు నిర్మాణాలు చేపట్టి నివసిస్తున్నారని, వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు శ్రీరాములు, దండోరా రామాంజినేయులు, నరసింహులు,తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

హిందూపురం: పట్టణంలోని సూగూరు సడ్లపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయ పునర్ నిర్మాణం సందర్భంగా భక్తులు విరాళాలు అందిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులకు కీర్తిశేషులు సావిత్రమ్మ, సుబ్బారావు కుటుంబ సభ్యులు రూ.1,00,116, సడ్లపల్లి విద్యా గణపతి సేవా సమితి బృందం సభ్యులు రూ.1,23,456 ,హౌసింగ్ బోర్డ్ రిటైర్డ్ టీచర్ ఎస్.శరభయ్య రూ.10,116ను విరాళలను అందజేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



అగళిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రొద్దం/అగళి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రొద్దం, అగళి మండల కేంద్రాల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధిపై వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో రొద్దం పీహెచ్‌సీ డాక్టర్ భాగ్యలక్ష్మి, అగళి డాక్టర్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో ఆక్రమణల తొలగింపు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం టౌన్: పట్టణంలోని నంది సర్కిల్ వద్ద ఉన్న ఆక్రమణలను సోమవారం మున్సిపల్ యంత్రాంగం తొలగించింది. ఈ నేపథ్యంలో షాపుల నిర్వాహకులు, మున్సిపల్ యంత్రాంగం మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం జేసీబీ యంత్రాలతో మున్సిపల్ అధికారులు నంది సర్కిల్ వద్దకు చేరుకుని ఆక్రమణల తొలగింపును చేపట్టారు. హిందూపురం బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ 2002 సంవత్సరం అప్పటి టీడీపీ ఎమ్మెల్యే సీసీ వెంకటరాముడు తమకు స్థలాన్ని కేటాయించడంతో పాటు కార్యాలయ ప్రారంభోత్సవం సైతం చేశారన్నారు. టీడీపీ ఎమ్మెల్యే ఇచ్చిన వాటినే ఇప్పుడు మళ్లీ టీడీపీ ఎమ్మెల్యేనే కూల్చేయిస్తున్నారని మండిపడ్డారు. తమకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ అక్కడి చేరుకుని మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. మున్సిపల్ అధికారులకు అంతగా అక్రమణలు తొలగించాలంటే చిన్నమార్కెట్‌లో టీడీపీ నాయకుడు కబ్జా చేసిన మున్సిపల్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. యూనియన్ కార్యాలయాలు, చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఉన్నఫలంగా వారి షాపులను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. బాలకృష్ణను నమ్మి ఓట్లేసినందుకు ప్రజలకు తగిన గుణపాఠం చెబుతున్నారని విమర్శించారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు సోమవారం నుంచి ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు తమ ఆధార్ కార్డు, పదో తరగతి హాల్ టికెట్ జిరాక్స్ కాపీలతో అడ్మిషన్ పొందవచ్చన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత అనంతరం ఫీజు చెల్లించాలని సూచించారు. బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులతో పాటు హెచ్‌సీఎంఎల్ కోర్సు, ఒకేషనల్ విభాగంలో ఐబిటీ, సీఈటీ లాంటి కోర్సులు, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ లాంటి పారామెడికల్ కోర్సులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేషన్ డీలర్ల అక్రమాలపై చర్యలు తీసుకోండి

గోరంట్ల: 'మండల కేంద్రమైన గోరంట్ల పంచాయతీ పరిధిలోని రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడుతుండటంతో పాటు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా పేదలకు సక్రమంగా సరుకులు అందించడంలేదు. వారిపై చర్యలు తీసుకోవాలి' అని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ మారుతీ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న , స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ

హిందూపురం: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని హిందూపురం ముద్దిరెడ్డిపల్లిలో రుక్మిణీ పాండురంగ స్వామి దేవాలయంలో సోమవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం చేపట్టారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు.

మారెమ్మకు పూజలు

గుడిబండ: మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని తుమ్మల మారెమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఘనంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అగళి: మండల పరిధిలోని ఉల్లేకెరలో మారమ్మదేవి జాతర సోమవారం వైభవంగా జరిగింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

అలరించిన రామ భజనలు

పావగడ: తాలూకాలోని వైఎస్ హొసకోటలో అశ్వర్థం కట్ట వద్ద వెలసిన రాముడి దేవాలయంలో సోమవారం భక్త భజన మండలి ఆలపించిన రామ భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హిందూపురం: సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు

సిద్ధరూఢస్వామి రథోత్సవం

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి రోడ్డులో వెలసిన సిద్ధరూఢస్వామి రథోత్సవం ఘనంగా సోమవారం ఘనంగా జరిగింది. ఆలయం నుంచి తమ్మడేపల్లిలో ఉన్న పాదుకట్ట వరకూ రథాన్ని లాగారు.

మారెమ్మదేవి జలధి ఉత్సవం

అమరాపురం: మండల పరిధిలోని వలస గ్రామంలో వెలసిన మారెమ్మదేవి జలధి ఉత్సవాన్ని భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి పూజలు చేసి డప్పు వాయిద్యాలతో చెరువు సమీపంలోని వంక వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. మళ్లీ అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు.



మారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	38.0
పెనుకొండ	40.0
మడకశిర	38.0

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయండి

చిలమత్తూరు/మడకశిర: : మాజీ ముఖ్యమంత్రి , వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాప్తాడు నియోజకవర్గంలోని పాపిరెడ్డిపల్లి పర్యటన నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూపురం, మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు టీఎన్ దీపిక , ఈరలక్కప్ప పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు వేర్వేరు ప్రకటనలను విడుదల చేశారు. పాపిరెడ్డిపల్లిలో ఇటీవల టీడీపీ గూండాల చేతిలో హత్యకు గురైన లింగమయ్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శిస్తారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

రోడ్డు కోసం సంతకాల సేకరణ



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఎస్‌యూసీఐ నాయకులు

పరిగి: మండల కేంద్రం నుంచి రొద్దం మండలం కలిపి గ్రామానికి వెళ్లే రోడ్డుకు తారు వేయాలని ఎస్‌యూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. పైడేటి సర్కిల్ నుంచి నేషనల్ హైవే 544ఈఈకు అనుసంధానంగా ఉన్న కలిపి రోడ్డు వేయాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్‌యూసీఐ నాయకుడు రంగనాయకులు మాట్లాడుతూ గుంతలు పూడ్చి, మట్టి రోడ్లను తారురోడ్లుగా మారుస్తామన్న కూటమి ప్రభుత్వం గతుకుల రోడ్డును పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అనంతరం తహసీల్దారు హసీనా సుల్తానాకు వినతిపత్రమిచ్చారు.

రామేశ్వరం నుంచి కాశీకి పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న సాధువులు

పెనుకొండ రూరల్: తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం నుంచి కాశీ వరకూ 24 మంది సాధువులు పాదయాత్ర చేపట్టారు. వారి పాదయాత్ర సోమవారం దుద్దేబండ షిర్డిసాయిబాబా ఆలయానికి చేరుకుంది. ఆలయ ధర్మకర్త గురప్ప సాధువులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొటిపి క్రాస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తున్న మారుతి, ప్రభు వద్ద నుంచి 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అయితే వారు ఇద్దరూ పరారైనట్లు తెలిపారు. దీనిపై కేసును నమోదు చేశామన్నారు. అలాగే చిలమత్తూరుకు చెందిన శివారెడ్డి కర్ణాటక మద్యం రవాణా చేస్తుండగా అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 188 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



రంగనాథస్వామి స్వామి మూల విరాట్

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో వెలసిన సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 8న అంకురార్పణ, ధ్వజారోహణం, 9న ప్రాకారోత్సవం, మత్స్యావతారం, 10న గరుడోత్సవం, 11న శేషాలంకారం, 12న బ్రహ్మరథోత్సవం, 13న దీపోత్సవం, 14న వసంతోత్సవం, 15న శయనోత్సవం, 16న ఆదిశేషు అలంకరణ జరుగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి తెలిపారు.